క్లుప్తంగా

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని రూరల్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి వీఆర్వోలకు సూచించారు. సోమవారం తహసీల్దార్ తన చాంబర్‌లో వీఆర్వోలు, ఆర్ఐలు, డీటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యాత్మకమైనవి ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. స్పందన సమస్యలపై నిర్లక్ష్యం తగదన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, సీఎస్‌డీటీ వలీబాషా, ఆర్ఐ జయరామిరెడ్డి, పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

ఆదోని రూరల్: నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని భీమా ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు విద్యార్థులకు సూచించారు. ఆర్విన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో నిర్వహించిన ఇంటర్నల్ టెస్ట్ ప్రిపరేషన్ ట్రైనింగ్ ప్రోగాంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ ట్రైనీ రాజాధీరజ్, శివకుమార్‌రాజు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్

ఆదోని టౌన్: పట్టణంలోని 3, 32వ వార్డు సచివాలయాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలించి పలు సూచనలు చేశారు. సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు.

16న ఎస్వీ యూనివర్సిటీ వద్ద ధర్నా

ఆదోని అర్బన్: ఈనెల 16న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, జిల్లా కన్వీనర్ కె.తిరుమలేష్ తెలిపారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్లను సోమవారం వారు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రాజు, మేఘన, నిఖిత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ కొండల్లో కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు హరిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగపూజ, కుంకుమార్చన, ఫల, పుష్ప మహా మంగళహారతి పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మిగనూరు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వై.సీతారామిరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, దస్తగిరిగౌడు పాల్గొన్నారు.

18న క్రికెట్ టోర్నీ

పత్తికొండరూరల్: మండల పరిధిలోని పులికొండ రంగనాథస్వామి తిరునాల సందర్భంగా ఈ నెల 18న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ సురేష్, రఘు సోమవారం తెలిపారు. విజేతలకు రూ.20 వేలు,రూ.10వేలు,రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్న ట్లు వెల్లడించారు. ఆసక్తిగల వారు సెల్ 97053 32256,9515385091నంబర్లను సంప్రదించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

18 నుంచి ఉరుసు

చిప్పగిరి: ఈ నెల 18 నుంచి నంచర్లలో హజరత్ దివానే మస్తాన్ వలి స్వామి 37వ ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు శేషావలి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 18న గంధం, 19న ఉరుసు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కోతిరాళ్ల గ్రామానికి చెందిన ఆవుల అరవింద్ బీహార్‌లో జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అథ్లెట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడు. వెంకటేష్, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడైన అరవింద్ గ్రామంలో మూడో తరగతి వరకు చదివాడు. క్రీడలపై ఆసక్తితో కడప స్పోర్ట్స్ పాఠశాలలో సీటు సంపాదించి అక్కడ 9వ తరగతి చదువుతున్నాడు. ఒలంపిక్స్‌లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని సాధించడం తన లక్ష్యమని అరవింద్ సోమవారం తెలిపాడు. విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల బియ్యం పక్కదారి

పేదల బియ్యం పక్కదారి పడుతోంది. ప్రతి కార్డుదారుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నెలకు 5 కేజీల చొప్పున రెండుసార్లు పంపిణీ చేస్తోంది. వీటిని పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు కిలో రూ.10 నుంచి రూ.11 వరకు కొనుగోలు చేసి పక్క రాష్ట్రంలో రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారుల నుంచి సేకరించి ఆస్పరి రోడ్డులోని ఓ ప్రాంతంలో నిల్వ ఉంచుకుని రాత్రివేళల్లో రోజుకు ఒక లారీ చొప్పున పేదల బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి.

– ఆదోని అర్బన్/ఆదోని రూరల్

- యథేచ్ఛగా కర్ణాటక రాష్ట్రానికి తరలింపు
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ

నియోజకవర్గంలో బియ్యం వ్యాపారులు తమ అక్రమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గతంలో అప్పుడప్పుడూ పోలీసులు, రెవెన్యూ అధికారులు సోదాలు చేసేవారు. కొంతకాలంలో నిఘా లేకపోవడంతో బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. అయినా ఆరు నెలల నుంచి ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

నియోజకవర్గానికి ప్రతినెలా 4 మెట్రిక్ టన్నులు

కేంద్ర ప్రభుత్వం రెండు మెట్రిక్ టన్నులు, రాష్ట్ర ప్రభుత్వం రెండు మెట్రిక్ టన్నులు కలిపి ప్రతినెలా 4 మెట్రిక్ టన్నుల బియ్యం పేదల కోసం మంజూరు చేస్తోంది. ఈ లెక్క ప్రకారం ఒక మెట్రిక్ టన్ను 10 వేల క్వింటాళ్లు. గత నెల నుంచి కేంద్రం పంపిణీ నిలిపివేసింది. అయితే ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 20 వేల క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. నియోజకవర్గంలో 78,089 మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారు. ఇందులో 40 శాతం మంది మాత్రమే పేదలు బియ్యాన్ని వాడుకుంటున్నారని, 60 శాతం వరకు అక్రమాలబాట పడుతోందని తెలుస్తోంది.

వ్యాపారుల ఆగడాలు

- గతంలో ఇద్దరు వ్యాపారులు వెంకటరెడ్డి, రాజశేఖర్‌లు ఆటో డ్రైవర్, ఓ విలేకరికి సమాచారం ఇచ్చారని, ఆటో డ్రైవర్, విలేకరిపై దాడి చేసిన ఘటనలో తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరి వ్యాపారులపై కేసు నమోదైంది.



పట్టణంలో ఓ ప్రాంతంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం (ఫైల్)

- పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆటోలో సబ్సిడీ బియ్యాన్ని తరలిస్తుండగా ఓ విలేకరి పట్టుకోవడంతో ఎక్కడ తన ఉద్యోగం పోతుందోనని కొంత మొత్తానికి డీల్ చేసుకుని వ్యాపారులకు బియ్యాన్ని ఆటోలో తరలించి చేతులు దులిపేసుకుంది.
- సిరుగుప్పలో లారీతో పాటు ఐదుగురిపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవర్, క్లీనర్, లారీ ఓనర్ ఆదోనికి చెందిన వెంకటరెడ్డితో పాటు కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలూకా గిల్లెసూగూరు గ్రామానికి చెందిన వీరేష్, గిరిపై కర్ణాటక పోలీసులు అక్రమంగా లారీల్లో బియ్యాన్ని తరలిస్తుండగా దాడి చేసి గతేడాది అక్టోబర్ 31న కేసు నమోదు చేశారు.

కేసు నమోదు చేస్తాం



నిత్యావసర వస్తువులను అక్రమంగా తరలిస్తూ ఉంటే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. సబ్సిడీ బియ్యం పక్కదారి పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. బీఆర్‌ఓ, ఆర్ఐ, సీఎస్‌డీటీలతో తనిఖీలు చేయిస్తాం. సబ్సిడీ బియ్యం దందా చేసే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. – వెంకటలక్ష్మి, తహసీల్దార్

వ్యర్థాలతోనూ సంపద సృష్టి

ఎమ్మిగనూరు: పారిశుద్ధ్యంపై ప్రజల భాగస్వామ్యం పెరగాలని, వ్యర్థాలతో ఉత్తమ ఉత్పత్తులు తయారు చేయవచ్చని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిద్దార్థ కళాశాలలో విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరణ చేపట్టడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు గృహాలు, కమర్షియల్ వినియోగదారుల నుంచి సేకరించే తడి చెత్తను కంపోస్టు ఎరువులు, బయోగ్యాస్ ఉత్పత్తికి వినియోగించవచ్చన్నారు. పొడి చెత్త నుంచి సంపద సృష్టించ వచ్చన్నారు. అలాగే గాజుసీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు, అట్టముక్కలు, కవర్లు, పేపర్లను గడి వేములలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించి పునరుత్పత్తి చేపడతారని వివరించారు. విద్యార్థులు పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకొని ఇరుగుపొరుగు వారికి వివరించాలన్నారు. కళాశాల కరెస్పాండెంట్ వేణుగోపాలాచారి, సచివాలయ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

గ్రామాల్లో ప్రశాంతత అవసరం

కౌతాళం: గ్రామాల్లో ప్రశాంతత అవసరమని ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామం నదిచాగిలో సోమవారం స్థానిక మారెమ్మ ఆలయం వద్ద గ్రామస్తులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరు చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటిని ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం గ్రామంలో వెలసిన తోంటదార్య స్వామి మఠాన్ని డీఎస్పీతో పాటు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డిలు సందర్శించారు. డీఎస్పీ, ఎస్ఐలను మఠం పీఠాధిపతి సిద్దలింగమహాస్వామి శాలువా పూలమాలతో సత్కరించారు.



డీఎస్పీని, ఎస్ఐను సన్మానిస్తున్న మఠం పీఠాధిపతి

హొళగుంద పీహెచ్‌సీకి డాక్టర్ల నియామకం

సాక్షి ఎఫెక్ట్

హొళగుంద: హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల పట్ల వైద్యుల నిర్లక్ష్యం, ప్రజలకు వైద్య సేవలు అందకపోవడంపై ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'వైద్యం దైవాధీనం' కథనానికి ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. గజ్జహళ్లి పీహెచ్‌సీ నుంచి ఇక్కడికి బదిలీపై రావాల్సిన న్యూటన్ అనే వైద్యుడు బాధ్యతలు తీసుకోకుండా సెలవులో ఉండడం, మరో వైద్యుడు వెంకటసుబ్బయ్య గత రెండు నెలలుగా ఆస్పత్రికి రాకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారిన సంగతి తెలిసిందే. పీహెచ్‌సీలో ఉండే స్టాఫ్ నర్సులే రోగులకు దిక్కుగా మారారు. ఈ నెల 11న హొళగుందకు చెందిన ఓ మహిళను చికిత్స కోసం పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం సిబ్బంది ఆదోనికి రెఫర్ చేశారు. మార్గమధ్యలోనే ఆమె మరణించింది. దీనిపై పత్రికలో వార్త కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. సెలవులో ఉన్న వైద్యుడు న్యూటన్ వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు మరో డాక్టరు వెంకటసుబ్బయ్య స్థానంలో హాలహర్వి పీహెచ్‌సీలో పని చేసే డాక్టర్ తిమ్మన్నను హొళగుందకు తాత్కాలిక డాక్టరుగా ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి నియమించారు. ఇదిలా ఉండగా డాక్టరు వెంకటసుబ్బయ్యను ఉన్నతాధికారులు డీఎంహెచ్‌ఓకు సరెండర్ చేసినట్లు సమాచారం. ఏదేమైనా ఇన్నాళ్లు డాక్టర్లు లేక బోసిపోయిన ఆస్పత్రిలో సోమవారం ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు సేవలందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అప్పర్‌భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారి



ఆందోళన చేస్తున్న ఆర్‌ఏవీఎఫ్ నాయకులు

ఆదోని అర్బన్: అప్పర్‌భద్ర ప్రాజెక్టుతో భవిష్యత్‌లో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమకు న్యాయం చేయకపోగా.. కర్ణాటకలోని అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ సోమవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా జాతీయ జలసంఘం అనుమతులతో పాటు కేంద్ర హోదా కల్పించి సుమారు రూ.5,300 కోట్లతో ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడం రాయలసీమ రైతాంగాన్ని మోసం చేయడమేనని ఆరోపించారు. రాయలసీమలోని ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డ్‌ను కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. సంగమేశ్వరం వద్ద తీగల వంతెనకు బదులుగా బ్రిడ్జి కం బ్యారేజీని నిర్మించాలని, రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రామంజిని, శాంతప్ప, రంగన్న, సురేష్, ఉరుకుంద, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ప్రారంభం వాయిదా

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని శ్రీమఠం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన టూరిస్టు పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోసిగి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిలుచున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పరసగేని నాగరాజు సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిలబడి ఉన్నాడు. ఐరన్‌గల్లు గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులను ఎక్కించుకుని కోసిగి బస్టాండ్‌కు చేరుకుంది. ఈక్రమంలో బస్టాండ్ వద్ద నిలబడి ఉన్న నాగరాజు కాలిపై ఆటో వెనుక చక్రం వెళ్లింది. ప్రమాదంలో కాలి ఎముక విరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో అదే ఆటోలో బాధితుడిని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తికి జైలుశిక్ష

ఆదోని రూరల్: మండలంలోని బైచిగేరి గ్రామానికి చెందిన హరిజన హుసేనికి ఆదోని కోర్టు 14 నెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. 2013 మార్చి నెలలో హరిజన హుసేని అదే గ్రామానికి చెందిన సువార్తమ్మను చేయి పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించడమేగాకుండా దాడి చేసినట్లు అప్పట్లో కేసు నమోదైంది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శైలజ సోమవారం నిందితుడు హరిజన హుసేనికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

సరోజిని నాయుడుకు నివాళి

వెల్దుర్తి: స్వతంత్ర్య సమరయోధురాలు, దేశంలోని మొదటి మహిళా గవర్నర్ సరోజిని నాయుడు జయంతి పురస్కరించుకుని సోమవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవితాబాయ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సరోజిని దేవి చిత్రపటానికి పూలమాల వేసి, ఆమె దేశానికి చేసిన సేవలను వివరించారు. పాఠకులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి




ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్య తలెత్తకుండా 133కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి కోరారు. సోమవారం డి.బెళగల్ విద్యుత్ సబ్ స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతిని మురళీమోహన్‌రెడ్డి కలిసి వినతిపత్రం ఇచ్చారు.


అంజన్నకు వార్షికోత్సవ పూజలు

ఆదోని అర్బన్: పట్టణంలోని మండిగిరి, మున్సిపల్ కాలనీల్లో వెలిసిన అభయ ఆంజనేయస్వామి సీతారాముల దేవస్థానంలో పదో వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఉత్సవమూర్తులకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ వారు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పురవీధులగుండా ఉత్సవమూర్తులకు పల్లకీసేవ, చిన్నారులు, మహిళలు మేళతాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేంద్రస్వామి, వెంకటాద్రి, వెంకటస్వామి, రామంజి, శ్రీధర్, ఉదయ్, శివమాలధారులు పాల్గొన్నారు.





పూజలందుకున్న అభయ ఆంజనేయస్వామి అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలందుకున్న సీతారాములు

రామలింగేశ్వరుడికి విశేష పూజలు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని రాంపురం గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని పాతవూరులో వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివమాల ధరించిన శివస్వాములు, భక్తులు, గ్రామస్తులు ఫల, పుష్ప, క్షీరా, పంచామృతాభిషేకాలు చేపట్టారు. శ్రీమఠంలోని శివలింగానికి పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరుకుంద ఈరన్నకు ప్రత్యేక పూజలు

కౌతాళం: ఈరన్న స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

జాతర సందడి

కోసిగి: ప్రజల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా మూడో రోజు సోమవారం మండల కేంద్రంలో భక్తులతో సందడి నెలకొంది. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో గాజుల దుకాణం, చిన్నారుల బొమ్మలు, రంగుల రాట్నం, స్టీల్, రాగి, వంట సామగ్రి, నేతి మిఠాయిలు, చిన్నారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి జంపింగ్, రైలు బండి, నీళ్లల్లో సైకిలింగ్ ఆకర్షణీయంగా నిలిచాయి. ఇక్కడ కడ్డీలతో కాల్చిన మాంసం ఆరగించేందుకు భక్తులు ఆసక్తి చూపారు.



భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం



నోరూరించే కాల్చిన మాంసం



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



రంగుల రాట్నంలో సందడి చేస్తున్న చిన్నారులు